కర సేవకులను సన్మానించిన ఎమ్మెల్యే

మద్నూర్, జనవరి 22: మద్నూర్ మండలం నుంచి 1990లో అయోధ్య కర సేవకు వెళ్లిన ఆరుగురు కర సేవకులను, కుటుంబ సభ్యులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు సోమవారం ఘనంగా సన్మానించారు. అప్పట్లో అయోధ్య గుడి నిర్మాణానికి వెళ్లి మధ్యప్రదేశ్‌లోని ఘజియాబాద్ జైలులో 14 రోజుల పాటు అప్పటి ప్రభుత్వం వారిని అరెస్టు చేసి నిర్బంధించారు.మండల కేంద్రానికి చెందిన కంశెట్టి శ్రీనివాస్, తమ్మేవార్ సుభాష్, దరాస్ సాయిలు, సాయాగౌడ్, రామన్న మృతి చెందగా, ఆయన కుమారుడైన బలిరాంకు, లక్ష్మణ్ మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యుడిని సన్మానించారు.





కౌలు రైతుల్లో.. ఆశలు!

- కొత్త ప్రభుత్వమైనా కౌలు రైతులను గుర్తించేనా?
- రైతు భరోసా కింద దరఖాస్తుల స్వీకరణ
- కౌలు రైతుల పథకానికి జిల్లాలో 7,200 మంది దరఖాస్తులు
- ఏళ్ల తరబడి పట్టించుకోని ప్రభుత్వాలు
- పంట అమ్ముకోవడానికి అవస్థలు
- ప్రతీ సీజన్‌లో ఎరువుల కోసం తిప్పలే..
- రుణాలు లేక ప్రైవేట్‌గా అప్పులు

కామారెడ్డి(ఆంధ్రజ్యోతి), జనవరి 22: సొంత భూములు లేక కౌలుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులను గత ప్రభుత్వాలు గుర్తించ లేదు. పంట సాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం నుంచి సాకారం అందక, పండించిన పంట అధికారికంగా అమ్ముకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. భూ యజమానులైన రైతులకు ప్రభుత్వం సాగు కోసం అందించే తోడ్పాటు రైతుబంధు ముందుగానే చేతికి అందుతుంది. కష్టపడి పనిచేసే కౌలురైతుకు ఎక్కడా సహాయం అందడం లేదు. వ్యవసాయమే తప్ప ఇతర పని చేయలేని కౌలు రైతులంతా ఏడాదంతా కష్టపడి పండించిన పంటను అమ్మి అధిక శాతం వడ్డీకి తీసుకున్న ప్రైవేట్ అప్పులే తీరుస్తున్నారు. అయితే ఎన్నికల సమయంలో కౌలు రైతులకు సహాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఆరు గ్యారెంటీ స్కీంలలో రైతుభరోసా కింద కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా ఇప్పటికే కౌలు రైతుల నుంచి ప్రభుత్వం ప్రజాపాలన సదస్సులో దరఖాస్తులను స్వీకరించింది. దీంతో కౌలు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 7,200ల మందికి పైగా కౌలు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కొత్త ప్రభుత్వమైన కౌలు రైతులను గుర్తిస్తుందో లేదో చూడాలి.

జిల్లాలో 30వేలకు పైగా కౌలు రైతులు

జిల్లాలో 30వేలకు పైగా కౌలు రైతులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరాత్ర రంగాలకు చెందిన వారు వ్యవసాయం చేసే ఆసక్తి లేకపోవడంతో పాటు సాగు కష్టాలను ఎదుర్కొనే పరిస్థితులు లేక తమ భూములను కౌలుకు ఇచ్చేస్తుంటారు. గత ప్రభుత్వంలో ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు విడతలుగా అందిస్తున్న రైతుబంధు పంట సహాయం పట్టాదారు రైతుల ఖాతాల్లోనే జమ అవుతూ వచ్చింది. పంటను సాగు చేసిన కౌలు రైతు పేరే ఎక్కడా లేకుండా పోయింది. ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధులో కౌలు రైతు ఊసేలేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారుతుంది. పంటలు సాగు చేసి ఎరువులు, కలుపులు తీయాల్సిన పరిస్థితుల్లో పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకులు కూడా కౌలు రైతులకు రుణం ఇవ్వడం లేదు. గతంలో కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను జారీ చేసేవారు. గత తెలంగాణ ప్రభుత్వం కొంత కాలంగా భూములన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి ధరణి పోర్టల్ ద్వారా పూర్తి వివరాలను ఉంచింది. కొత్తగా జారీ చేసిన డిజిటల్ పాసు పుస్తకాల్లో పట్టాదారు పేరు మినహా ఇతర కాలం ఎక్కడా లేదు. దీంతో కౌలు రైతుల గుర్తింపునకు శాశ్వతంగా అడ్డుకట్టపడింది.

పెరుగుతున్న పెట్టుబడులు

రోజురోజుకూ పంట పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఒక ఎకరంలో పత్తిపంట వేయాలంటే రూ25వేలు, వరి పొలానికి రూ.30 వేలు, మొక్కజొన్న చేనుకు రూ.20 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కౌలు డబ్బులు కాకుండా రైతు కుటుంబీకుల కష్టం పోను విత్తనాలు, ఎరువులకే అధిక పెట్టుబడి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంత కష్టపడినప్పటికీ ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15 వేలు కూడా మిగిలే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైన కౌలు రైతులను గుర్తించి అర్హత కార్డులు ఇచ్చి, బ్యాంకు రుణాలు అందేలా చూడాలని కౌలు రైతులు కోరుతున్నారు.

అమ్ముకోవడానికి తిప్పలు

కౌలు తీసుకున్న భూమిలో ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన కౌలు రైతులకు పంట అమ్ముకోవడానికి తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏఏ పంట సాగు చేస్తున్నాడు అనే వివరాలను వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. అధికారులు సైతం పట్టా పాసు పుస్తకం కలిగిన రైతుల వివరాలను మాత్రమే సర్వేలో నమోదు చేస్తున్నారు. తమకు రైతుబంధు ఎక్కడ రాదో అనే భయంతో పంట సాగు చేయకుండా పట్టాపాసుపుస్తకం ఉన్న భూ యజమానులు సైతం కౌలు రైతు పంటను తమ పేరున నమోదు చేయించుకుంటున్నారు. వివరాలు అన్నీ భూ యజమాని పేరు మీదుగా నమోదై ఉండడంతో కౌలు రైతు పంట విక్రయించే సమయానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కౌలు రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలు, సీసీఐ కేంద్రాల వద్ద విక్రయించేప్పుడు భూ యజమాని వివరాలు ముందస్తుగా ఉండడంతో వారి ఖాతాల్లోకి పంట విక్రయానికి సంబంధించిన సొమ్ము జమ అవుతోంది. తిరిగి వారి ఖాతాలో నుంచి తీసుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం జరిగినా పరిహారం సైతం కౌలుకు ఇచ్చిన భూ యజమానికే వర్తిస్తుందని కౌలు రైతులు చెబుతున్నారు.

అంతా రామమయం



కామారెడ్డిలో శ్రీరాముడి విగ్రహాన్ని తీసుకుని వస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 22: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేళ జిల్లా అంతటా రామనామంతో మారుమోగింది. సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్, రామ మందిరాల్లో దీపారాధన, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రతీ ఇంట్లో పూజలు నిర్వహించి అయోధ్య రామ మందిర్‌లోని బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పలు ఆలయాల్లో నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛంధంగా బంద్ నిర్వహించి స్వామివారి వేడుకల్లో పాల్గొన్నారు. రామమందిర్‌లో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు. విద్యానగర్‌లోని శివసాయి పార్క్ కమిటీ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు శ్రీరాముడి విగ్రహానికి పూజలు నిర్వహించి మంగళహారతులు ఇచ్చి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ధర్మశాలలో హిందూవాహిని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జై శ్రీరాం అంటూ దీపాలతో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



శ్రీరాముడి వేషధారణలో చిన్నారులు

సీఎంఆర్ ధాన్యాన్ని త్వరగా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ మేనేజర్ రాజు

కామారెడ్డి టౌన్, జనవరి 22: గత ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని త్వరగా అందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పౌర సరఫరాల అధికారులను ఎఫ్‌సీఐ మేనేజర్ రాజు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ ధాన్యం జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున జిల్లాలో ధాన్యం పెండింగ్ ఉన్న రైసుమిల్లుల్లో ఈ నెలాఖరులోగా తమకు కేటాయించిన లక్ష్యం మేరకు అందించేలా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటలు మిల్లులు నడపాలని, లక్ష్యాలను సాధించిన మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ వారి సహకారంతో టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించామని, రోజు పలు రైసుమిల్లులను తనిఖీ చేస్తు వేగవంతం చేస్తున్నామన్నారు. కాగా ఎఫ్‌సీఐలో ధాన్యం నిల్వకు స్థలం కేటాయించాలని, అదేవిధంగా రవాణాకు అధికంగా వ్యాగన్‌లను కేటాయించాలని కోరగా మేనేజర్ రాజు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రకాష్‌వర్మ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ శేఖర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారి మల్లిఖార్జున్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

29న ఎస్‌ఎంసీ ఎన్నికలు

- ప్రారంభమైన ప్రక్రియ
- అన్ని పాఠశాలల్లో ఎన్నికలు
- తల్లిదండ్రుల జాబితాను సిద్ధం చేస్తున్న హెచ్‌ఎంలు



కామారెడ్డి టౌన్/భిక్కనూరు, జనవరి 22: పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)లకు ఎన్నికల నగరా మోగింది. ఈనెల 29న ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. 2019లో అప్పటి ప్రభుత్వం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించింది. కరోనా కారణంగా కమిటీల కాలపరిమితిని పొడగిస్తూ వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మళ్లీ ఎస్‌ఎంసీ ఎన్నికలు జరపాలని నిశ్చయించింది. అందుకు తగ్గట్లుగా ఈనెల 20న ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అన్ని పాఠశాలల పరిధిలోని ఒకటి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా ఉంటారు. వారి నుంచే ఒకరిని చైర్మన్, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు.

ఎన్నుకునే విధానం ఇలా..

హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తా రు. పాఠశాలలోని ప్రతీ తరగతిలో ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. వారంతా కలిసి ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ కమిటీలో ఆరుగురు ఎక్స్ అఫీషియో, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు ఉంటారు. వీరు రెండేళ్ల పాటు పదవిలో ఉంటారు. బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. వారి పిల్లలు పాఠశాలలను వదిలివెళితే ఎస్‌ఎంసీలో పదవిలో ఉండేవారు వారి పదవి కోల్పోతారు. ఒక విద్యార్థి తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుల్లో ఒకరే ఓటుకు అర్హులు. ఎన్నికల సమయంలో ఓటరు జాబితాలోని 50 శాతం మంది హాజరు కావాల్సి ఉంటుంది. చేతులెత్తే పద్ధతి లేదా ముజువాణి ఓటుతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ ఉంటుంది. ఈ కమిటీల్లో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్‌వాడి, ఆరోగ్య కార్యకర్త, మహిళ సమాఖ్య సభ్యురాలికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. కేటగిరిల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు.

ఇవీ ఎస్‌ఎంసీల బాధ్యతలు

పాఠశాల యాజమాన్య కమిటీలు మధ్యాహ్న భోజనం నిర్వహణ, విద్యార్థుల హాజరు, యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా మన ఊరు-మన బడి పనులను పర్యవేక్షించాలి. పాఠశాలలో మూత్రశాలలు, తాగునీరు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలి. పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. చైర్మన్, హెచ్‌ఎం జాయింట్ ఖాతాలో పాఠశాల అభివృద్ధి నిధులను జమ చేస్తారు. వారి ఇరువురి సంతకాలతో నిధులు వినియోగించాల్సి ఉంటుంది. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించి పాఠశాలలోని సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది.



జంగంపల్లి ఎస్‌ఎంసీ కమిటీ సమావేశం (ఫైల్)

రేపు తుది జాబితా ప్రకటన

ఎస్‌ఎంసీ ఎన్నికల ప్రక్రియ శనివారం ప్రారంభం కావడంతో పాఠశాల పరిధిలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనేలా హెచ్‌ఎంలు నోటిఫికేషన్ జారీ చేశారు. నోటీస్ బోర్డుపై తల్లిదండ్రుల జాబితాను ప్రదర్శించారు. ఈనెల 22, 23న అభ్యంతరాలను స్వీకరించి అభ్యంతరాలు ఉంటే పరిష్కారించాల్సి ఉంటుంది. 24న తుది జాబితాను ప్రదర్శించనున్నారు. 29న ఎన్నికలు, కొత్త ఎస్‌ఎంసీ ఎన్నిక, అదేరోజు తొలి సమావేశం ఉంటుంది.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ప్రజావాణికి 27 ఫిర్యాదులు

కామారెడ్డి టౌన్, జనవరి 22: కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 27 ఫిర్యాదులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. ఇందులో రెవెన్యూ 13, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 1, డీఆర్‌డీవో 1, మున్సిపల్ 1, హౌసింగ్ 1, ఎక్సైజ్ 1, మిషన్ భగీరథ 1, డీపీవో 6, డీఈవో 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసల కోర్చి వస్తున్న ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను శాఖల వారిగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, డీఆర్‌డీవో సాయన్న తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీలకు జిల్లా నేతల సన్మానం



మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీర్ అలీలను సన్మానిస్తున్న ఆకుల లలిత దంపతులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 22: ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారుడిగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీలను జిల్లాకు చెందిన పలువురు నేతలు సోమవారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, నాయకులు గడీల రాములు, రత్నాకర్, తదితరులు షబ్బీర్‌అలీని సన్మానించారు. ఈ సందర్భంగా శాలువ, బుకేలతో శుభాకాంక్షలు తెలిపారు.

8 రోజుల్లో ముగియనున్న పదవీ కాలం

● ప్రగతి పనులకు పైసలేవీ..? ● లక్షల్లో సర్పంచుల బిల్లుల పెండింగ్ ● ఆందోళనలో ప్రజాప్రతినిధులు



ఎత్తొండ గ్రామ పంచాయతీ



కోటగిరి గ్రామంలో చేపట్టిన సీసీ డ్రైనేజీ

కోటగిరి,జనవరి22: సర్పంచుల పదవి కాలం ఈ నెలాఖరుకు ముగుస్తుండడంతో పెండింగ్ బిల్లులపై గ్రామ ప్రథమ పౌరులో ఆందోళన నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత సర్పంచుల పదవి కాలంలో అనేక అభివృద్ధి పనులు కొనసాగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు విరివిరిగా రావడంతో సర్పంచులు గ్రామాలలో హరితహారం, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు, సీసీ డ్రైనేజీలు, రహదారుల నిర్మాణం, వీధి లైట్ల ఏర్పాటు తదితర పనులకు లక్షలు వెచ్చించారు. పెట్టుబడి పెట్టి పనులు చేసిన బిల్లుల మంజూరులో గత ప్రభుత్వంతో పాటు ఉపాధి హామీలో చేసిన వాటికి నిధులు మంజూరు కాకపోవడంతో అప్పుల పాలయ్యారు. పలుమార్లు గత ప్రభుత్వ పెద్దలను కలిసిన ప్రయోజనం లేకపోవడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉమ్మడి జిల్లాలో పలువురు సర్పంచ్‌లు వివిధ రూపాలలో తమ నిరసనలు తెలిపారు. పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించలేక సర్పంచ్‌లు భిక్షాటన చేసి తమ నిరసనను నిస్సాహయతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ప్రయత్నించారు. తమ పదవి కాలం ముగుస్తున్న పెండింగ్‌లో ఉన్న లక్షల రూపాయల బిల్లులు రాకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఇంటి చుట్టు తిరుగుతున్న కోటగిరి మండలంలోని ఎత్తొండ సర్పంచ్ సాయిబాబా పలు సందర్భాలలో వాపోయారు. సర్పంచ్‌ల పదవి కాలాన్ని పొడగించడం పట్ల ఇప్పటికి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ఎన్నికల నిర్వహణ పట్ల సైతం ప్రభుత్వం మొగ్గు చూపకపోవడంతో వచ్చే నెల నుండి ప్రత్యేక అధికారుల పాలన ఉండవచ్చు అనే ప్రచారం జరుగుతుంది. తాము పదవిలో ఉన్నప్పుడే బిల్లులను క్లియర్ చేసుకోవాలనే తాపత్రాయంతో సర్పంచ్‌లు ప్రభుత్వ పెద్దల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

● గుదిబండలా మారిన ట్రాక్టర్ల నిర్వహణ

గ్రామాలలో పారిశుధ్య నిర్వహణకు ప్రతి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను కొనుగోలు చేయాలని గత ప్రభుత్వం ఆదేశించింది. సర్పంచ్‌లు అప్పులు చేసి మరి ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. నెల నెల పంచాయతీల నుండి వసూలు చేసిన సొమ్మును గ్రామాలలో నియమించిన మల్టీపర్పస్ వర్కర్లు, సిబ్బంది జీతాలకే సరిపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ పంచాయతీ సర్పంచ్‌లకు గుది బండలా మారింది. చాలా చోట్ల నిర్వహణ లేకపోవడంతో అవి మూలకు చేరాయి. డిజీల్ బిల్లులతో పాటు హరిత హారంలో చెట్లకు నీరు పెట్టడం వల్ల వచ్చే డబ్బులు సకాలంలో రాకపోవడంతో ట్రాక్టర్ల డ్రైవర్లకు నెల నెల జీతాలు ఇచ్చే పరస్థితి లేకపోయింది. వెయ్యికి పైగా జనాభా ఉన్న గ్రామాలలో పరిస్థితి కొంత అనుకూలంగా ఉన్న చిన్న పంచాయతీలు, కొత్తగా ఏర్పడిన పంచాయతీలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. చిన్న పంచాయతీలకు నెల నెల లక్ష లోపే ఆదాయం ఉండగా ఖర్చు మాత్రం 3లక్షలకు పైగా ఉండడంతో సర్పంచ్‌లకు ఏమి చేయాలో తోచక అప్పులు చేసి మరి నిర్వహణ చేపట్టారు. ఇప్పుడు ఈ బిల్లులు రాకపోవడం త్వరలోనే పదవి కాలం ముగియనుండడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1050కి పైగా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు సగానికి పైగా గ్రామ పంచాయతీలకు 3నుంచి 4లక్షలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత ప్రజాప్రతినిధుల ద్వారా తెలిసింది. ఎక్కువగా ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు, సిబ్బంది జీతాలు గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. ఉపాధి హామీ కింద గ్రామాలలో వైకుంఠ ధామాలు, రైతు వేదికలతో పాటు అనేక పనులు చేశారు. ఈ పనులకు సంబంధించి గత ఏడాది మే నెలాఖరు వరకు బిల్లులు మంజూరయ్యాయి. జూన్ నుండి ఆరు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల ప్రభుత్వం నుండి డబ్బులు రాగా ఉపాధి హామీ కింద నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. మరి కొన్ని చోట్ల ఉపాధి హామీ కింద మంజూరైన రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఉమ్మడి జిల్లాలో కేంద్ర, రాష్ట్రాల నుండి వచ్చిన నిధులతో పాటు ఉపాధి హామీ కింద పంచాయతీలకు సుమారు వంద కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలి



కోటగిరి మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి 10నెలలు కావస్తుంది. సుమారు 10లక్షల పెట్టుబడి పెట్టగా ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. ఎంబీ రికార్డులు నమోదు చేసి పంపామని అధికారులు చెబుతున్న నిధులు మంజూరు కావడం లేదు. ఏడాది నుండి ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీ కార్మికులకు అప్పులు చేసి వేతనాలు చెల్లించాము.

- పత్తి లక్ష్మణ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, కోటగిరి

ఆరు లక్షలకు పైగా నిధులు రావాలి



గ్రామంలో స్పీకర్ పర్యటన సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టాము. మొరం రోడ్లు వేశాము. ఆరు నెలలుగా 9మంది గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోయాము. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆరు లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆరు లక్షలకు తోడు జీతాల చెల్లింపుకు మరో ఆరు లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. మరో 8రోజుల్లో పదవి కాలం ముగిసే సమయానికైన ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయాలి.

- ఏజాజ్ ఖాన్, హంగర్గ ఫారం సర్పంచ్

మహంతం, స్టేషన్ ఏరియాల్లో గ్రామసభలు



మహంతం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగెం శ్రీనివాస్

నవీపేట,జనవరి22: మండలంలోని మహంతం, స్టేషన్ ఏరియాలలో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించి ఈ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. డ్రోన్ ద్వారా రసాయనిక ఎరువులు పిచికారి చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, స్టేషన్ ఏరియా సర్పంచ్ షకీల్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, ఆర్ఐ మోహన్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 5నుండి ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు సోమవారంతో ముగిశాయి.

ఆలయాల్లో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పూజలు



సిద్దులగుట్టపై రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి దంపతులు

ఆర్మూర్‌రూరల్, జనవరి22: అయోధ్య బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠా సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సోమవారం పలు ఆలయాలలో పూజలు నిర్వహించారు. మండలంలో అంకాపూర్ రామాలయం, ఆర్మూర్ సిద్దులగుట్టపై గల రామాలయంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి శ్రీరాముని పాదలు, పల్లకి సేవలో పాల్గొన్నారు. అనంతరం పెర్కిట్, మామిడిపల్లి, ఇస్సాపల్లి గ్రామాలలో శ్రీరాముని అభిషేక కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అయోధ్య కల 500ఏళ్ళ నాటిదని ప్రతీ హిందువు గర్వించదగ్గ విషమన్నారు. దేశంలో, ప్రపంచ వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొందని శ్రీరాముడు ప్రతీఒక్కరికి ఆదర్శవంతుడని అన్నారు. ఇంతటి మహోన్నత కార్యక్రమం చేపట్టిన ప్రధాని నరేంద్రమోదీ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలెపు రాజు, ఆలూర్ మండల అధ్యక్షుడు గిరిష్, మాజీ జడ్పీటీసీ లత పీర్‌సింగ్, కౌన్సిలర్ ఆకుల రాము, సొసైటీ మాజీచైర్మన్ గంగారెడ్డి, ఆకుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ నిధులతో గోదాం నిర్మాణం



భూమిపూజ అనంతరం మాట్లాడుతున్న దృశ్యం

బోధన్ రూరల్, జనవరి 22 : బోధన్ మండలంలోని పెంటాకలాన్ సహకార సంఘం పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో సోమవారం 250 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి సహకార సంఘం సొసైటీ చైర్మన్ దోనకంటి రాజారెడ్డి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, అందరి సహకారంతో పెంటాకలాన్ సొసైటీకి వచ్చిన ఆదాయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.17 లక్షలతో గోదాం నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. సహకార సంఘానికి వచ్చిన ఆదాయంతో రైతులందరికీ ఉపయోగపడేలా గోదాంలతో పాటు పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. బర్దిపూర్ గ్రామ రైతులకు ఇక నుంచి తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు గ్రామంలోనే అందుబాటులో ఉంటాయన్నారు. రైతుల సంక్షేమం కోసం పెంటాకలాన్ సొసైటీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సాయారెడ్డి, శంకర్, పవన్, రమణ, బెజ్జం వెంకట్ రెడ్డి, ఎంపీటీసీలు సువర్ణ, సంజీవ్‌కుమార్, జయశ్రీ భూంరెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు బి.శివకుమార్, డైరెక్టర్లు దమ్మయ్య, గోనే లక్ష్మవ్వ, భూంరెడ్డి, ఎస్.పోతిరెడ్డి, కె.చిన్న గంగాధర్, సీఈవో బాబాలతో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాయకులు సంజీవ్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, ముత్తి రాములు, సహకార సంఘం సభ్యులు, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెంజర్ల పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

ముప్కాల్, జనవరి22 ముప్కాల్ మండలంలోని రెంజర్ల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థుల స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన తోటి విద్యార్థులకు విద్య ను బోధించారు. పాఠశాల విద్యార్థులే పాఠశాల హెచ్ఎంగా, ఉపాధ్యా యులుగా వ్యవహరించారు. ఈ సందర్భం గా మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నిజామాబాద్ అర్బన్, జనవరి 22: అస్సాంలో భారత్ జోడో న్యాయ యాత్రపై బీజేపీ గుండాల దాడిని ఖండిస్తూ ఎన్ఎస్‌యూఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు నిఖిల్, శివ తదితరులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయయాత్రపై బీజేపీ దాడిని ఖండిస్తున్నామన్నారు. దేశంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తున్నందువల్లే రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రభుత్వం దాడులు చేయిస్తుందన్నారు. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ కొంత మంది బీజేపీ చిల్లర నాయకులతో కలిసి దాడులు చేయడం పిరికిపంద చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో శివ, విశాల్‌రెడ్డి, చందూ, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో తిమ్మాపూర్ విద్యార్థులు ప్రథమం

మోర్తాడ్, జనవరి22: మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో ప్రథమ స్థానం, బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో గెలిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెం జర్ల గ్రామంలో గడ్డం జనార్ధన్‌రెడ్డి మెమోరియల్ 68వ ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్‌ను ఈ రెండు జట్లు విజేతలుగా నిలిచాయి. దీంతో సోమవారం పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు తమ్మిరెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ షీల్డ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు శ్యామ్, ఉపాధ్యాయులు పురుషోత్తం,చరణ్, శ్యామ్‌రావు, స్వర్ణలత,పాల్గొన్నారు.

అర్గుల్‌లో పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదు

జక్రాన్‌పల్లి, జనవరి22: మండలంలోని అర్గుల్ గ్రామంలో సోమవారం పీడీఎస్ యూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీఎస్ యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు మండల బాధ్యుడు అనిల్‌కుమార్ విద్యార్థులకు పీడీఎస్‌యూ సభ్యత్వాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మమత,శిరీష,అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనారిటీ జూనియర్ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి

కోటగిరి,జనవరి22: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. శాశ్వత బిల్డింగ్ నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్ కోరగా సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షహీద్, అఫ్జల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ధర్పల్లి, జనవరి 22:కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని దుబ్బాక, రేకులపల్లి గ్రామాల్లో భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించేందుకు సంకల్ప యాత్రను చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలకు సంబంధించి క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యంచ గోదావరిలో వ్యక్తి మృత దేహం లభ్యం

నవీపేట,జనవరి22: మండలంలోని యంచ గోదావరిలో సోమవారం గుర్తు తెలియని 35 నుంచి 40సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడు నల్లపు రంగు జీన్ ప్యాంటు, ఖాకీ రంగు గల ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. మృతదేహంపై ఎటువంటి గాయాలు లేవని అతడు సుమారు మూడు రోజుల క్రితం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్లాక్ మార్కెట్‌కు రేషన్ బియ్యంపై సీరియస్

● 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడ్వాయి, జనవరి 22: మండలంలో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యంపై రెవెన్యూ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీరియస్ అయ్యారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'దర్జాగా బ్లాక్ మార్కెట్‌కు రేషన్ బియ్యం' అనే కథనంపై అధికారులు స్పందించారు. ఏఏ గ్రామాల్లో రేషన్ డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు బియ్యా న్ని తరలిస్తున్నారనే విషయంపై ఆరా తీస్తున్నారు. రేషన్ డీలర్లకు సహకరిస్తూ బ్లాక్ మార్కెట్‌కు ధాన్యం తరలేలా చేస్తున్న అధికారులపైన దృష్టి సారించనున్నారు.

తాడ్వాయిలో ఓ వ్యక్తి దారుణ హత్య

● పక్కా ప్రణాళికతోనే హత్య చేసిన దుండగులు

● రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం



హత్యకు గురైన శంకర్

తాడ్వాయి, జనవరి 22: తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడి శివారులో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పక్కా ప్రణాళికతో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి రోడ్డు పక్కన పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశారు. తాడ్వాయి ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ముదాం శంకర్(42) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడని ఎస్‌ఐ తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సోమారం సోలార్ ప్లాంట్ సమీపంలో మృతదేహాన్ని వదిలేసి మృతదేహంపై మృతుడి బైకును ఉంచి పారిపోయినట్లు నిర్ధారణ అవుతుందని తెలిపారు. కావాలనే పథకం ప్రకారం దుండగులు శంకర్‌ను బలమైన రాడ్‌తో తలపై బాది హత్య చేశారు. రక్తపు మరకలను పసిగట్టి గమనిస్తూ వెళ్లగా బ్రహ్మాజీవాడి శివారులోని సోమారంతండావాసి జత్యానాయక్ పొలంలో హత్య చేసి మృతదేహాన్ని రోడ్డుపై పడేసి ఉంచినట్టుగా గుర్తించామన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతుడికి కుమార్తె రాధిక ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

● హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ముదాం శంకర్‌ను హత్య చేసిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని తాడ్వాయి గ్రామస్థులు కోరుతున్నారు. అమాయకుడైన ముదాం శంకర్‌ను ఎందుకు హత మార్చారు అనే విషయమై గ్రామస్థులు ఆరా తీస్తున్నారు. ఎలాంటి గొడవలు లేకుండా గ్రామంలో కలివిడిగా తిరిగే శంకర్‌ను ఎవరు హత మార్చి ఉంటారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైలులో నుంచి పడి వ్యక్తికి గాయాలు



కామారెడ్డి టౌన్, జనవరి 22: కామారెడ్డి పట్టణ శివారులో అడ్లూర్ వద్ద గుర్తు తెలియని రైలులోంచి సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలపాలైనట్లు రైల్వే ఎస్‌ఐ తావునాయక్ తెలిపారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల సదరు వ్యక్తిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఎవరైన ఆ వ్యక్తిని గుర్తుపడితే కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కామారెడ్డి టౌన్, జనవరి 22: కామారెడ్డి పట్టణానికి చెందిన రామ చంద్రం, యాదగిరి రాజులకు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.200ల జరిమానా విధించారని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మద్యం తాగి వాహనం నడపకూడదని పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బాన్సువాడలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గణిత ప్రతిభ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు

బాన్సువాడ టౌన్, జనవరి 22: భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీవో భుజంగరావు మాట్లాడుతూ విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంచేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఫోరం బాన్సువాడ డివిజన్ ఇన్‌చార్జి నీలం కుమారస్వామి, ప్రధానోపాధ్యాయులు కొంతం వెంకటేశం, వెంకటరమణ, ఉపాధ్యాయులు సాయిలు, సంజీవులు,శివరాం, తదితరులున్నారు.

మొదటి ర్యాంక్ సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థి

సదాశివనగర్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టులో సదాశివనగర్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఏ.భవిత్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలోనే మొదటి ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. సోమవారం పాఠశాలలో గైడ్ టీచర్ దశరథ్ విద్యార్థి భవిత్‌కుమార్‌ను అభినందించారు. అదేవిధంగా మండల కేంద్రంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో సైతం మోడల్ స్కూల్ విద్యార్థులు భవిత్‌కుమార్, వర్షాశ్రీ, కీర్తిలు మొదటి మూడు స్థానాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు అనితశర్మ, విద్యా రమణ, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేందర్‌లు పాల్గొన్నారు.



బాన్సువాడ శ్రీరామ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



బీర్కూర్‌లో శ్రీరామ శోభాయాత్ర



మద్నూర్‌లో రాముడు, జానకీ వేషధారణలతో చిన్నారులు

జిల్లాలో మార్మోగిన శ్రీరామ నామస్మరణ

బాన్సువాడ టౌన్, జనవరి 22: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా సోమవారం బాన్సువాడ పట్టణంలో శ్రీరామ నామస్మరణతో మారుమోగిపోయింది. ఉదయం నుంచి శ్రీరామ మందిరం, పెద్ద హనుమాన్ మందిరం, గౌలిగూడ హనుమాన్ మందిరం , పాత బాన్సువాడ హనుమాన్ మందిరం, పాత రాంమందిరం, సంగమేశ్వరాలయం, రుక్మిణీ విఠలేశ్వరాలయం, హనుమాన్ వ్యాయామశాల మందిరాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు గార్లే శ్రీనివాస్ దంపతులు సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వీక్షించేందుకు ఆలయ ప్రాంగణంలో డిజిటల్ స్ర్కీన్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు పోటెత్తడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీరామ ఆలయ కమిటీ సభ్యులు దాత గార్లే శ్రీనివాస్ దంపతులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. హిందూవాహిని, హిందూధార్మిక సంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పెద్ద హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమై బాన్సువాడ పురవీధుల గుండా సాగింది.

బీర్కూర్‌లో ఘనంగా శ్రీరాముడి శోభాయాత్ర

బీర్కూర్: మండల కేంద్రంలోని రామాలయం భక్తుల తాకిడికి కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు బాజాబజంత్రీల మధ్య శ్రీరాముని శోభాయాత్రను చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి రామలయంలో పూజలు నిర్వహించి, జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను ఏర్పా టు చేశారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళలో మహిళలు తమ ఇళ్లలో ఐదు దీపాలు వెలిగించి శ్రీరామ నామాన్ని జపించారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లోని రామాలయాలతో పాటు ఆయా ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట రామాలయంలో పంతులు సంజీవ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మద్నూర్‌లో శోభాయాత్ర

మద్నూర్: మండలంలోని మద్నూర్, డోంగ్లీ మండలంలోని గ్రామాల్లోని దేవాలయాలను విద్యుద్ దీపాలతో అలంకరించారు. గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. మండల కేంద్రంలో శోభాయాత్రలో నిర్వహించారు. మద్నూర్‌లో సంత ఉన్నప్పటికీ వ్యాపారులు, తమ వ్యాపారాలను మూసివేసి రామనామ సంకీర్తనలలో పాల్గొన్నారు. బాలాజీ మందిరంతో పాటు అంజనేయ స్వామి ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రామ ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. సాయంత్రం మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరం నుంచి శోభాయాత్ర నిర్వహించారు.

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న రామాలయం, హనుమాన్ ఆలయాలను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు, సాయంత్రం యువకులు డీజే సౌండ్‌తో ర్యాలీలు నిర్వహించారు. పూజ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇక జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామంతో పాటు, కేంరాజ్ కల్లాలి గ్రామాల్లో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొని రాములోరికి హారతులిచ్చారు.

పిట్లం: మండలంలోని రామమందిరంలో వేద పండితులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ శ్రీరాముని ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నాగిరెడ్డిపేటలో సీతారాముల పల్లకి సేవ

నాగిరెడ్డి పేట: మండలంలోని గ్రామాల్లో శ్రీరాముని భక్తులు పెద్ద ఎత్తున గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో రామ భక్తులు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుండా సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రధాన రహదారి గుండా ఊరేగింపుగా రామాలయం వరకు తీసుకెళ్లి ఆయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భిక్కనూరులో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలను డీజే సౌండ్ మధ్య జైశ్రీరాం నినాదాల మధ్య యువకులు ఊరేగించారు. ఊరేగింపునకు మహిళలు ఆయా గ్రామాల్లో మంగళహారతులతో స్వాగతం పలికారు. యువకులు ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున బైక్‌ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున స్వామివారి కల్యాణాన్ని వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయంలో భక్తులు లైవ్‌లో వీక్షించేందుకు భారీ ఎల్‌ఈడీ టీవీ ఏర్పాటు చేశారు. గొట్టిముక్కుల, అంచనూర్, సీతారాంపల్లి, చింతమాన్‌పల్లి, సంగమేశ్వర్, లింగుపల్లి, ముత్యంపేట, అంబార్‌పేట గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహిళలు మంగళహారతులతో పెద్ద ఎత్తున ఆలయాల్లోకి చేరుకున్నారు. ప్రతిష్ఠాపన అనంతరం ఆలయాల్లో అక్షింతలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సదాశివనగర్: మండలంలోని ప్రతీ గ్రామంలోని ఆలయాల్లో శ్రీరామ జపం మార్మోగింది. మండల కేంద్రంలోని శ్రీరాముని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేయడంతో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు కనులారా వీక్షించారు. రామాల యా లతో పాటు హనుమాన్ ఆలయాల వద్ద పూజలు, చందనాలు సమర్పించి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పెద్ద ఎత్తున అన్నప్ర సాద వితర ణ చేపట్టారు. సాయంత్రం ఇంటి వద్ద జ్యోతులు వెలిగించి బాణాసంచ కాల్చి పండుగ వాతావరణం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి సదాశివనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీబీపేట: మండల కేంద్రంతో పాటు యాడారం, మల్కాపూర్, ఉప్పర్‌పల్లి, తుజాల్‌పూర్, ఇస్సానగర్ తదితర గ్రామాల్లో అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట ఆలయాలను శుద్ధి చేసి మామిడి తోరణాలు, పువ్వులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. యాడారంలోని రామాలయంలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

మాచారెడ్డి: మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం సన్నిధిలో పాలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ప్రజలు పెద్ద ఎత్తున మంగళహారతులతో స్వాగతం పలికి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పల్వంచ మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆలయాల్లో పెద్దఎత్తున పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

తాడ్వాయి: మండలంలోని కన్కల్, నందివాడ, ఎర్రపహాడ్, తాడ్వాయి, కృష్ణాజీవాడి, బ్రహ్మణపల్లి, చిట్యాల, సంతాయిపేట, బ్రహ్మాజీవాడి గ్రామాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ ఇంట్లో 5 దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

లింగంపేట: మండల కేంద్రంలోని రామాలయంలో ఉత్సవ విగ్రహాలకు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. వ్యాపారులు వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అలాగే అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం తరలిన కరసేవకులను సన్మానించారు.



భిక్కనూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



దోమకొండలో..



మాచారెడ్డిలో..

పేదలకు కేంద్ర పథకాలు అందించడమే లక్ష్యం

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



వికసిత్ భారత్ క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డి టౌన్, జనవరి 22: కేంద్రప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందాలనేది ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తు వారిని కేంద్రప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. క్యాలెండర్‌లు, వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ భార్గవ్, డీఎస్‌వో, ఎస్‌బీఐ మేనేజర్ వినయ్ చంద్ర, పీఆర్‌పీ సునిత, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీకి శుభాకాంక్షల వెల్లువ



షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జనవరి22: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్‌అలీని కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అధికారంలో ఉన్న లేకున్నా పార్టీకి విధేయుడుగా ఉంటూ ప్రజా శ్రేయస్సు కోసమే పనిచేసే నాయకుడికి ప్రభుత్వం సలహాదారుడి నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అంతకముందు కామారెడ్డిలో టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ చాట్ల వంశీ, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, గోనె శ్రీనివాస్, దేవరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

దోమకొండ: ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీశాఖల సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్‌అలీని సోమవారం దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లోని తన నివాసంలో కలసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. షబ్బీర్‌ను కలసిన వారిలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీటీసీలు పిరంగి రాజేశ్వర్, నిమ్మ శంకర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు స్వామి, శ్రీకాంత్, రామస్వామిగౌడ్, మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సీతారాం మధు, రాములు, తదితరులు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

పెద్దకొడప్‌గల్, జనవరి 22: జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామ శివారులో గల కోటకు వెళ్లే రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ పనులను సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పరిశీలించారు. ఈ పాటికే అధికారులు గ్రామం పక్కనే ఉన్న వాగుపై ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పైపులు వేసి వాహనాలు ప్రయాణం చేసేలా రహదారి పనులు చేపట్టారు. జెండా పండుగ సమీపిస్తున్నందున పనులను వేగవంతం చేయాలని, తోటకు వెళ్లే మెట్ల మార్గంలో ఉన్న మొక్కలను తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు అనితాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య కరసేవకులకు సన్మానం

బాన్సువాడటౌన్, జనవరి 22: 1990, 1992లో అయోధ్య కరసేవకు వెళ్లిన వారిని సోమవారం పట్టణంలోని పెద్దహనుమాన్ మందిరంలో భక్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ్యనారాయణ, అర్షపల్లి సాయిరెడ్డి, డాకయ్య, శ్రీనివాస్, అనిల్, సాయిలు, రాములు, విఠల్‌రెడ్డి, గంగాధర్, మురళీ , నాగరాజు, శ్రీనివాస్, సాయిబాబా తదితరులున్నారు.

ఎస్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నిజాంసాగర్, జనవరి 22: నిజాంసాగర్ మండలకేంద్రంలోని జీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం ఎస్‌టీయూ కామారెడ్డి క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎన్. రాంచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌తో పాటు డైరీని ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి కె.రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- నా సామి రంగ
ప్రియా 35	- సైందవ్

బాన్సువాడ	
మహేశ్వరి	- గుంటూరు కారం
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

